సాక్షి
చిత్తూరు

బుధవారం । 12 । జూలై । 2023



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

రాపూరు మండలం, తెగచర్ల చెరువు వద్ద మూడు ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



గృహ నిర్మాణాలు వేగవంతం

వి.కోట మండలంలో కలెక్టర్ షణ్మోహన్ పర్యటించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. - 8లో



వేడుకగా సామూహిక భజనలు

టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భజన మండళ్ల సామూహిక భజనలు వేడుకగా నిర్వహించారు. - 8లో

ఆగ్రహజ్వాల

పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలపై జిల్లా వ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు ఆకాశాన్నంటాయి. నిస్వార్థంగా సేవలందించిన వలంటీర్లను అవమానించడంపై నిరసనలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుల ఇంటి ముంగిటకే చేరుస్తున్న సేవకులపై ఆరోపణలు అర్థరహితమని ప్రజా సంఘాలు విమర్శించాయి. ఈ క్రమంలో వలంటీర్లు సైతం ఎక్కడికక్కడ ఆందోళనకు దిగారు. భారీ ర్యాలీలు నిర్వహించి.. మానవహారంగా ఏర్పడ్డారు. జనసేన అధినేత దిష్టిబొమ్మలను దహనం చేశారు. పవన్ క్షమాపణలు చెప్పేంత వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



బంగారుపాళెంలో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై మండిపడిన వలంటీర్లు
- జనసేన అధినేత ఆరోపణపై జిల్లావ్యాప్తంగా నిరసనలు
- క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదులు
- క్షమాపణలు చెప్పేంత వరకు పోరాడుతామని స్పష్టీకరణ

చిత్తూరు అర్బన్ : ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ.. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న తమపై పవన్ కల్యాణ్ అసత్య ఆరోపణలు చేయడం దారుణమని వలంటీర్లు మండిపడ్డారు. మంగళవారం ఈ మేరకు జిల్లావ్యాప్తంగా నిరసనలతో హోరెత్తించారు. జనసేన అధ్యక్షుడి దిష్టిబొమ్మలకు చెప్పుల దండలు వేసి దహనం చేశారు. పవన్ క్షమాపణ చెప్పాల్సిందే అంటూ డిమాండ్ చేశారు. చంద్రబాబుతో కలిసి తమపై బురదజల్లుతున్నారని, అనుచిత వ్యాఖ్యలతో కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

- నగరి టవర్‌క్లాక్ సెంటర్‌లో దాదాపు 200 మందికి పైగా వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను ఊరేగించి, దహనం చేశారు.
- కుప్పం ఆర్టీసీ బస్టాండు వద్ద వలంటీర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేసి, ఆయన చేసిన నిరాధార ఆరోపణలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే రామకుప్పంలోని వైఎస్సార్ సర్కిల్ నుంచి విజలాపురం కూడలి వరకు పవన్ దిష్టిబొమ్మను ఊరేగించారు. పవన్‌పై క్రిమినల్ కేసు నమోదుచేయాలని రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యంలో పవన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. యాదమరి మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు.
- వెదురుకుప్పం మండం పచ్చికాలపల్లంలో వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. పవన్ ఫొటోలు దహనం చేశారు. పెద్దపంజాణిలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను ఊరేగించారు. వలంటీర్ల నిరసనకు ఎమ్మెల్యే వెంకటేగౌడ సంఘీభావం తెలిపారు.
- పుంగనూరు మున్సిపల్ కార్యాలయం నుంచి వలంటీర్లు భారీ ర్యాలీ చేపట్టారు. పవన్ కల్యాణ్ ప్యాకేజీలు తీసుకుని చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారాడని ఆరోపించారు. నిరాధార ఆరోపణలు చేసి తమ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు యత్నిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అనంతరం పవన్ దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. ఇప్పటికైనా ఆరోపణలను వెనక్కు తీసుకోకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అలాగే సదుంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి నేతృత్వంలో వలంటీర్లు నిరసన తెలిపారు. పవన్ వ్యాఖ్యలు సమాజానికి కీడు చేసేలా ఉన్నాయని మండిపడ్డారు.



నగరిలో నిరసన తెలుపుతున్న వలంటీర్లు



నగరిలో మానవహారంగా ఏర్పడిన వలంటీర్లు, నేతలు



రామకుప్పంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు



సదుంలో ..



పచ్చికాపల్లంలో ఆందోళన చేస్తున్న వలంటీర్లు, నేతలు



పుంగనూరులో వలంటీర్లు ర్యాలీ



గంగవరంలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు

అన్నీతానై ఎనలేని సేవలు



ఇతని పేరు అశోక్. గంగవరం మండలం, తాళ్లపల్లె గ్రామ వలంటీర్. రెండేళ్ల క్రితం కోవిడ్ సమయంలో గ్రామస్తులకు అన్నీతానై ఎనలేని సేవలందించాడు. వైరస్ బారిన పడిన వారి ఇళ్లకు సైతం వెళ్లి సాయం చేశాడు. రెడ్‌జోన్‌లోకి వెళ్లేందుకు అందరూ భయపడుతున్న తరుణంలో మొక్కవోని ధైర్యంతో చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాడు. తన క్లస్టర్‌కే పరిమితం కాకుండా గ్రామంలోని అన్ని వీధుల్లో తానే శానిటేషన్ చేశాడు. బాధితులకు భోజనం, తాగు నీరు పంపిణీ చేశాడు.

దేవుడిని చూస్తున్నట్టే..



నాకు 80 ఏళ్లు. నడవలేని స్థితిలో పింఛన్ తీసుకోవాలంటే గతంలో నానా అవస్థలు పడేవాడిని. పోస్టాఫీసు దగ్గరకు ఉదయం వెళితే నగదు తీసుకునేందుకు రాత్రి అయిపోయేది. ఒక్కోసారి మరుసటి రోజు రమ్మని తిప్పి పంపేసేవాళ్లు. ఇప్పుడు నేను ఎక్కడకు పోవాల్సిన అవసరం లేకుండా వలంటీరే మా ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తున్నాడు. ప్రతి నెలా ఒకటో తేదీనే నాకు సొమ్ము అందిస్తున్నాడు. వలంటీర్‌ను చూస్తే నాకు దేవుడిని చూస్తున్నట్టే ఉంటుంది.

– గరటప్ప నాయుడు, కొలనాంపల్లె, యాదమరి మండలం

ఎప్పటికీ మరచిపోలేం



కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవలను ఎప్పటికీ మరచిపోలేం. గ్రామంలోని వీధులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించేవారు. వైరస్ వ్యాప్తి చెందకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించేవారు. ఎవరికైనా జ్వరం వచ్చినట్లు తెలిస్తే వెంటనే వైద్యులను తీసుకువచ్చి చికిత్స చేయించేవారు. ఇంటింటికీ వచ్చి మా క్షేమ సమాచారాలు తెలుసుకునేవారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా తక్షణ సాయం అందించేవారు.

– ఉషా, కొలనాంపల్లె దళితవాడ, యాదమరి మండలం

వలంటీర్లపై నిందలు తగదు



నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విశేష సేవలందిస్తున్న వలంటీర్లపై నిందలు వేయడం తగదు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న వారిని అనుచితంగా మాట్లాడడం పవన్ కల్యాణ్ దిగజారుడుతనానికి నిదర్శనం. ఆయన ఇలాగే మాట్లాడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. పవన్, చంద్రబాబుకు దమ్ముంటే వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టగలరా. ఇప్పటికైనా చేసిన తప్పును గ్రహించి వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలి.

– భరత్, ఎమ్మెల్సీ

న్యూస్‌రీల్

కు.ని శస్త్రచికిత్సలకు ప్రోత్సాహం



ర్యాలీ నిర్వహిస్తున్న నర్సింగ్ విద్యార్థులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

చిత్తూరు రూరల్: జిల్లాలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలను ప్రోత్సహించాలని డీఎంహెచ్ఓ ప్రభావతిదేవి ఆదేశించారు. మంగళవారం చిత్తూరులో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థినులతో కలిసి జిల్లా ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. జనభా నియంత్రణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ చిన్న కుటుంబం చింతలేని కుటుంబమని తెలిపారు. జనాభా పెరగడం వల్ల ఆర్థిక కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఒకరు లేదా ఇద్దరు ముద్దు అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దీనిపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణాధికారి శ్రీనివాసులు, అధికారులు జార్జి, గుణశేఖర్, సుదర్శన్, జిల్లా ఆస్పత్రి ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో డైరెక్టర్ సుబ్బరాజు

చిత్తూరు కార్పొరేషన్: వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో డిస్కం డైరెక్టర్ సుబ్బరాజు తెలిపారు. మంగళవారం చిత్తూరులోని ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయ సర్వీసుల కోసం రూ.5వేల కోట్లతో రాయలసీమ, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో రూ.వెయ్యి కోట్లను వెచ్చించనున్నట్లు వివరించారు. ఈ మేరకు ఆయా పనులకు టెండర్లు సైతం పిలిచినట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా చేస్తున్న లైన్లను సుమారు 20 ఏళ్ల క్రితం వేశారని, వాటిని జియో ట్యాగ్ చేయనున్నట్లు చెప్పారు. కొత్తగా విద్యుత్ స్తంభాలు, లైన్లు మార్చనున్నట్లు పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే సబ్‌స్టేషన్ల నుంచి వ్యవసాయానికి ప్రత్యేక ఫీడర్ల ద్వారా కరెంట్ సరఫరా అవుతుందని వెల్లడించారు. అలాగే గ్రామీణ ప్రాంతాలకు త్రీఫేజ్ విద్యుత్ అందించవచ్చని తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1912ను వినియోగించుకోవాలని సూచించారు. జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ శ్రీనివాసులు, ఈఈలు హరి, పద్మనాభపిళ్లై, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, జయప్రకాష్, శ్రీనివాసమూర్తి, సతీష్ పాల్గొన్నారు.

కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌కు ఏకాంబరకుప్పంలో స్టాపింగ్

– ఫలించిన మంత్రి ఆర్‌కే రోజా కృషి

నగరి : ఏకాంబరకుప్పంలో ఈ నెల 17వ తేదీ నుంచి కాచిగూడ ఎక్స్‌ప్రెస్ ఆగనుంది. ఈ మేరకు సదరన్ రైల్వే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాలుగేళ్ల ప్రజల ఆకాంక్ష నెరవేరుతోంది. మంత్రి ఆర్‌కే రోజా పట్టువదలక చేసిన కృషి ఫలించింది. ఈక్రమంలో సోమవారం సదరన్ రైల్వే సీనియర్ డివిజనల్ ఆపరేటింగ్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 4.18కి ఏకాంబరకుప్పం రైల్వే స్టేషన్‌లో కాచిగూడ ఎక్స్‌ప్రెస్ ఆగుతుందని, 4.20 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఈ నెల 23 నుంచి ఆన్‌లైన్ రిజర్వేషన్ కూడా అందుబాటులో ఉంటుందని వెల్లడించారు.



మంత్రి రోజా

ప్రజలకు వరం..జగనన్న సురక్ష



పలమనేరు : జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

పలమనేరు : ప్రజలకు జగనన్న సురక్ష పథకం ఓ వరమని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన పలమనేరు మండలంలో విస్తృతంగా పర్యటించారు. అభివృద్ధి పనులు, సురక్ష సమావేశాలు, ప్రభుత్వాస్పత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీ వడ్డూరులో జగనన్న లేఅవుట్‌ను పరిశీలించి ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఇల్లు మంజూరై నిర్మాణం చేపట్టకుంటే వెంటనే పట్టాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. పెంగరగుంట ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం పిల్లలకు రుచిగా వంట చేయాలని సూచించారు. కోతిగుట్ట గ్రామంలో నాడు–నేడు ఫేజ్–2 పనులను పరిశీలించి పది కాంపౌంట్ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సముద్రపల్లెలో ఆర్‌బీకేని తనిఖీ సెరి కల్చర్ అసిస్టెంట్ సేవలపై ఆరాతీశారు. గ్రామాల్లో మహిళా పోలీసులు కీలకంగా వ్యవహరించాలని కోరారు. కరిడిమొడుగు గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. అక్కడి బరువు తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్వాహకురాలిని ఆదేశించారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. కొలమాసనపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమాల్లో హౌసింగ్ డీఈ రమేష్ రెడ్డి, తహసీల్దార్ కుప్పుస్వామి, ఆర్ఐ నాయక్, ఎంఈఓ లీలారాణి, కన్వీనర్ బాలాజీనాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న అధికారులు

చిత్తూరు అర్బన్: గుడిపాల మండలం చీలాపల్లి క్రాస్‌లో మంగళవారం డీటీఎఫ్ అధికారులు చేపట్టిన వాహన తనిఖీల్లో కర్ణాటక మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. వివరాలు.. పేయనపల్లెకు చెందిన శరవణ ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యం తీసుకువస్తుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 12 బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో సీఐ మాధవస్వామి, ఎస్‌ఐ మస్తాన్‌వలీ, సిబ్బంది శ్రీనాథరెడ్డి, నాగరాజు, గౌతమ్ పాల్గొన్నారు.

నడిరోడ్డుపై రెండు వర్గాల ఘర్షణ

చిత్తూరు అర్బన్: నగరంలోని బజారువీధిలో మంగళవారం రెండు వర్గాలకు చెందిన వారు నడిరోడ్డుపై ఘర్షణకు దిగారు. దాదాపు గంట పాటు గొడవ జరగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వాహనా రాకపోకలు సైతం నిలిచిపోయాయి. కాసేపటికి అంతా సర్దుకోవడంతో చుట్టుపక్కల దుకాణాల వారు ఊపిరిపీల్చుకున్నారు. ఘర్షణపై విచారణ చేపట్టినట్లు టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు.

అక్రమ పింఛన్లు తొలగించినా రాద్ధాంతమే!



అభాగ్యుల పింఛన్లకు మోకాలొడ్డు

తాము కోరుకున్న వారు అధికారంలో లేకుంటే కల్పిత కథలతో బురద చల్లడమే పనిగా పెట్టుకున్న ఈనాడు 'అభాగ్యుల పింఛన్లకు మోకాలొడ్డు' అంటూ మరో అబద్ధాన్ని అచ్చేసింది. అనర్హుల పింఛన్లను తొలగించినా.. అది కూడా టీడీపీకి చెందిన వారి ఫిర్యాదుతో జరిగినా నెపం మాత్రం ప్రభుత్వంపైకి నెట్టే ప్రయత్నం చేసింది. కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలంలోని తుమ్మిశికి చెందిన కె.ఆర్.సునిత, బి.కె.సావిత్రి, శకుంతలమ్మల పింఛన్లను అడ్డంగా తొలగించారని ఈనాడు గగ్గోలు పెట్టింది. వాస్తవాలకు మసిపూసేందుకు విశ్వయత్నాలు చేసింది. దీనిపై సాక్షి ఫ్యాక్ట్ చెక్‌లో వెలుగు చూసిన వివరాలు ఇవి.

– సాక్షి నెట్‌వర్క్

కె.ఆర్.సునీత

స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ రామచంద్రప్ప కుమార్తె సునీత. ఈనాడు చెప్పినట్టు ఈమెకు ఆపివేసింది ఒంటరి మహిళ పింఛను కాదు. పింఛన్ ఐడి:110759737 కింద తామె 25.09.2015 నుంచి వితంతు పింఛన్ పొందేది. ఆమెను 15 ఏళ్ల క్రితం భర్త వదిలేశాడని, ఆయన బతికే ఉన్నాడని సునీత మాటగా ఈనాడు పేర్కొంది. అయినా నిబంధనల ప్రకారం ఒంటరి మహిళగా పింఛన్ పొందాలంటే లబ్ధిదారు వయసు 55 ఏళ్లకు మించి ఉండాలి. లేదా చట్టబద్ధంగా విడాకులు పొంది ఉండాలి. సుమారు 35 ఏళ్ల వయసున్న సునీత వద్ద భర్త డెత్ సర్టిఫికెట్ గానీ, కోర్టు ఇచ్చిన విడాకులు పత్రం గానీ లేవు. ఈ రెండూ లేకుండా తనను ఒంటరి మహిళగా ఈనాడు ఎలా తేల్చిందో రామోజీకే ఎరుక.

బి.కె.సావిత్రి

నాలుగు పదుల వయసున్న ఈమె భర్తను వదిలి 22 ఏళ్ల క్రితం పుట్టింటికి వచ్చేసిందని, ఈమెకు 2004 నుంచి ఒంటరి మహిళ పింఛన్ వచ్చేదని ఈనాడు ఉవాచ. కానీ పెన్షన్ ఐడి: 110322966 కింద 1.9.2007 నుంచి ఈమె పొందుతున్నది వితంతు పింఛన్. ఈమె కుటుంబంతో వివాదం రావడంతో అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మంజునాథ్ ఈ అక్రమ పింఛన్ వ్యవహారంపై అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ సందర్భంగా అధికారులు సావిత్రిని భర్త మరణ ధృవీకరణ పత్రం చూపాలని కోరినా ప్రయోజనం లేకపోయింది. చట్టబద్ధంగా పింఛన్ పొందేందుకు అవసరమైన సర్టిఫికెట్లను ఇవ్వకపోతే పింఛన్ రద్దు చేస్తామని నోటీసులు ఇచ్చి, స్పందన లేకపోవడంతో ఎట్టకేలకు ఈ యేడాది ఏప్రిల్ 20న ఆమె పింఛన్‌ను తొలగించారు.

శకుంతలమ్మ

చంద్రబాబు దయచూపి ఈమెకు మంజూరు చేసిన పింఛన్ రద్దు చేయటంతో జీవనం కష్టంగా మారిందని, ఆస్పత్రి ఖర్చులు – ఇతర అవసరాలు తీరటం లేదని ఈనాడు గగ్గోలు పెట్టింది. కానీ భర్త, పిల్లలతో ఉమ్మడి కుటుంబ పెద్దగా శకుంతలమ్మ లోటు లేని జీవితాన్నే అనుభవిస్తోంది. ఆమె కుటుంబంలో ఇద్దరు కుమారులు, కోడలు ఉన్నత ఉద్యోగాలు చేస్తూ తల్లిదండ్రులను బాగా చూసుకునే సహృదయం ఉన్నవారే. మరోవైపు ఆమె భర్త కె.వెంకట్రామప్పకు పింఛన్ ఐడి : 110818897 కింద వృద్ధాప్య పింఛన్ అందుతోంది. ఒకే కుటుంబంలో ఇద్దరికి వృద్ధాప్య పింఛన్లు ఇవ్వడం బాబు హయాంలో కూడా నిబంధనలకు విరుద్ధమే. దీనిపై ఫిర్యాదులు రావటంతో 2015 ఆగస్టులో మంజూరైన శకుంతలమ్మ పింఛన్‌ను 25.9.2021న రద్దు చేశారు.

తగిన సర్టిఫికెట్లు ఉంటే పింఛన్ మంజూరు



తుమ్మిశిలో నిబంధనలకు విరుద్ధంగా పొందుతున్న పింఛన్లను వివిధ సందర్భాల్లో పూర్తి విచారణ తర్వాతనే తొలగించాం. పింఛన్ రద్దయిన వారు నిబంధనల మేరకు తగిన సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకుంటే మళ్లీ పింఛన్ ఇవ్వటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. భర్త నుంచి విడిపోయిన మహిళలు 55 ఏళ్ల వయసు కలిగి కోర్టు ఇచ్చిన విడాకులు పత్రం, తహసీల్దారు జారీ చేసిన ఒంటరి మహిళ సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో జత చేయాలి. అలా కాకుండా వితంతు పింఛన్ అంటే భర్త డెత్ సర్టిఫికెట్ విధిగా ఉండాలి. అర్హత ఉన్న ఎవరైనా తమ వలంటీర్ల ద్వారా, లేదా నేరుగా గ్రామ సచివాలయాల్లో పింఛను కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

–హేమామాలిని,
ఎంపీడీవో, శాంతిపురం



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,420
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73.00

నాడు-నేడు పనులు వేగవంతం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో మనబడి నాడు–నేడు పనులు వేగవంతం చేయాలని డీఈఓ విజయేంద్రరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. మంగళవారం డీఈఓ కార్యాలయం నుంచి ఎంఈఓలు, హెచ్‌ఎంలతో వార వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పాఠశాలల్లో ప్రహరీగోడల నిర్మాణం మినహా మిగిలిన పనులను ఈనెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. పనులు అయిన వెంటనే బిల్లులు మంజూరు చేయాలని, బడి బయట పిల్లలు లేకుండ బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యార్థుల వివరాలు చైల్డ్‌ఇన్ఫోలో నమోదు చేయాలని సూచించారు.

ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, నిందితులతో అటవీశాఖ అధికారులు

రాపూరు: నెల్లూరు జిల్లా, రాపూరు మండలం, తెగచర్ల గ్రామ చెరువు వద్ద అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న మూడు ఎర్రచందనం దుంగలు, కారును టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి కారకులైన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు రాపూరు అటవీ రేంజర్ రవీంద్రబాబు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తిరుపతికి చెందిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, గోనుపల్లి అటవీశాఖ, బేస్ క్యాంప్ సిబ్బంది సోమవారం రాత్రి పెంచలకోన అడవుల్లో కూంబింగ్ నిర్వహించగా.. వైఎస్సార్ జిల్లా చిట్వేలి అడవుల్లో ఎర్రచందనం చెట్లు నరికినట్లు గుర్తించి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జాతీయ రహదారికి సమీపంలోని రాపూరు మండలం, తెగచర్ల గ్రామ చెరువు వద్ద ఉన్న కారును గుర్తించి అక్కడే కాపు కాయగా అడవుల్లో నుంచి ముగ్గురు వ్యక్తులు మూడు ఎర్రచందనం దుంగలతో కారువద్దకు రావడంతో సిబ్బంది మూకుమ్మడిగా వారిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న వంట సామగ్రితో పాటు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ ముగ్గురూ తమిళనాడు రాష్ట్రం, శీలం కు చెందిన వారిగా గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్టు వివరించారు. కూంబింగ్‌లో తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్, గోనుపల్లి డీఆర్వో మస్తానయ్య, సిబ్బంది ఫరీద్, ప్రవీణ్, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా 'సంక్షేమం'



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీ రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ సుధీర్

కుప్పంరూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎంపీ రెడ్డెప్ప కొనియాడారు. మంగళవారం పట్టణంలోని దళవాయి కొత్తపల్లెలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని, ఈ పథకాన్ని కేంద్రం సైతం అనుసరిస్తూ దేశంలోని 14వేల బడుల్లో అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందని వెల్లడించారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలను అందిస్తున్నామని వివరించారు. మున్సిపల్ చైర్మన్ సుధీర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం కింద ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్, కౌన్సిలర్లు మమత విజయ్, మాధవి మోహన్‌రామ్, గణపతి, నాగరాజు, నాయకులు సర్దార్, భాగ్యరాజ్, వెంకటేష్, కుమార్, అరుణ్ పాల్గొన్నారు.

త్వరలోనే నిర్వాసితులకు పరిహారం



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

శాంతిపురం : హంద్రీ–నీవా ప్రాజెక్టులో భాగంగా కుప్పం కెనాల్ కోసం సేకరించిన భూములకు సంబంధించి పరిహారం, పెండింగ్ బిల్లులను త్వరలోనే చెల్లించనున్నట్లు జేసీ పి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండల సచివాలయంలో వి.కోట, రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. కుప్పం కాలువ ద్వారా 110 చెరువులకు కృష్ణా జలాలు తరలిస్తామని, దీంతో 6,300 ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. రెండు నెలల్లో కాలువ ద్వారా నీరు తీసుకురావాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. గతంలో నిర్ణయించిన ప్రకారం రైతులకు అందాల్సిన పరిహారానికి వడ్డీతో కలిపి చెల్లించే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని, నిబంధనల మేరకు సమస్యలకు పరిష్కారాలు అన్వేషిస్తున్నామని వివరించారు. సమావేశంలో ఆర్డీఓ శివయ్య, హంద్రీ–నీవా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సందీప్, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ రాజేశ్వరిపై కేసు

చిత్తూరు అర్బన్: భూతగాదా విషయంలో మాజీ కౌన్సిలర్ రాజేశ్వరిపై మంగళవారం చిత్తూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఏర్పాటు విషయంలో తన భూమిని కబ్జా చేశారంటూ రోడెక్కి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినందుకు కేసు నమోదు చేశామని సీఐ మద్దయ్యా ఆచారి తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

వి.కోట : ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని పాపేపల్లె లేఅవుట్, బంగ్లా ఊరు జెడ్పీ హైస్కూల్, ఒగు పీఈఎస్ ఆస్పత్రి, నిర్మాణంలోని సచివాలయ భవనాన్ని కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల విన్నపం మేరకు పాపేపల్లె లేఅవుట్ సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను మార్చాలని సూచించారు. ఇందుకోసం ఐదెకరాలను సేకరించాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజల నుంచి వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, ఎంపీడీఓ వినోదిని, తహసీల్దార్ చిట్టిబాబు, వైస్ ఎంపీపీ తమీమ్ పాల్గొన్నారు.

16న చేతివృత్తిదారుల సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

చిత్తూరు కార్పొరేషన్: తిరుపతిలో ఈ నెల 16వ తేదీన చేతివృత్తిదారుల సదస్సు నిర్వహించనున్నట్లు చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య తెలిపారు. మంగళవారం చిత్తూరులో సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. వృత్తి దారులకు ముడి సరుకులను సబ్సిడీపై అందించాలని కోరారు. అలాగే సహకార రంగం పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఇంటి స్థలం మంజూరు చేసి షెడ్లు ఏర్పాటు చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు మణి, చంద్ర పాల్గొన్నారు.

నానమ్మపై మనవడి దాడి

చిత్తూరు రూరల్: మండలంలోని ముత్తుకూరులో మంగళవారం సొంత నానమ్మపైనే మనవడు దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. బీఎన్ఆర్‌పేట ఎస్ఐ వెంకట సుబ్బమ్మ కథనం మేరకు.. గ్రామానికి చెందిన గుణశేఖర్ అనే వ్యక్తి భార్యకు, అతడి నానమ్మ రాణెమ్మకు మధ్య కొన్నాళ్లుగా గొడవలున్నాయి. ఈ క్రమంలో ఇద్దరికీ వాగ్వాదం జరిగింది. ఈవిషయం తెలుసుకున్న గుణశేఖర్ ఆగ్రహం పట్టలేక ఇంట్లో వంట చేస్తున్న నాన్నమ్మ తలపై ఇనుపరాడ్‌తో కొట్టాడు. తీవ్రంగా గాయపడిన బాధితురాలు చికిత్స నిమిత్త చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో చేరింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేడుకగా సామూహిక భజనలు



భజన మండళ్ల సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న టీటీడీ జేఈఓ సదా భార్గవి



సామూహిక సంకీర్తన భజనల్లో పాల్గొన్న భజన మండళ్ల సభ్యులు

తిరుపతి కల్చరల్: టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం భజన మండళ్ల సామూహిక భజనలు వేడుకగా నిర్వహించారు. శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవంలో భాగంగా రెండో రోజు మంగళవారం మూడో సత్రం ప్రాంగణంలో సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సంకీర్తనాలాపన, ధార్మిక సందేశం అందించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రలకు చెందిన సుమారు 3,500 మందికిపైగా భజన మండళ్ల సభ్యులు హరినామ సంకీర్తనల భజనలు చేస్తూ తమ ఆధ్యాత్మికత భావాలను చాటుకున్నారు.

నేడు మెట్ల పూజ

చివరి రోజైన బుధవారం అలిపిరి పాదాల మండపం వద్ద మెట్ల పూజ చేయనున్నారు. ఈమేరకు భజన మండళ్ల సభ్యు లు మూడో సత్రం నుంచి అలిపిరి పాదాల మండపానికి చేరుకొని మెట్ల పూజలో పాల్గొని భజనలు నిర్వహిస్తారు. అనంతరం సప్తగిరులను అధిరోహించి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

విశ్వాసంతోనే విజయం

భగవంతుడిపై పరిపూర్ణ విశ్వాసంఉంచి పనులు మొదలు పెడితే తప్పక సఫలీకృతమవుతుందని టీటీడీ జేఈవో సదాభార్గవి తెలిపారు. రాత్రి జరిగిన భజన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు.

టైపు రైటింగ్ పరీక్షలు

తిరుపతి కల్చరల్: ఏపీ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ విజయవాడ వారు నిర్వహించే టైపు రైటింగ్ పరీక్షలు సెప్టెంబర్ 2, 3 తేదీలలో నిర్వహించనున్నట్లు ఏపీ టైప్ రైటింగ్ అండ్ కంప్యూటర్ అసోసియేషన్ తిరుపతి అధ్యక్షుడు కిరణ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 38 కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆగస్టు 26వ తేదీనతెలుగు షార్ట్ హ్యాండ్ పరీక్షలు, ఇంగ్లిష్ షార్ట్ హ్యాండ్ పరీక్షలు ఆగస్టు 27న ఆరు కేంద్రాలలో జరుగుతాయన్నారు. హాజరు కాదలచిన వారు పూర్తి వివరాలను ప్రభుత్వ గుర్తింపు కలిగిన టైప్ ఇన్‌స్టిట్యూట్‌లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

తెలుగుగంగ కాలువలో దూకి మహిళ గల్లంతు



మహేశ్వరి (ఫైల్)

వెంకటగిరిరూరల్: ''హలో.. ఏమండీ వంటగది డబ్బా కింద రూ.1,700 డబ్బులు పెట్టాను తీసుకోండి.. మీరు పిల్లలు జాగ్రత్త.. నేను తెలుగుగంగ కాలువ దగ్గర ఉన్నా'' అంటూ ఓ మహిళ తన భర్తతో ఫోన్‌లో మాట్లాడి తెలుగుగంగ దిగి గల్లంతయింది. ఈ ఘటన వెంకటగిరి రూరల్ మండలం కలపాడు గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. ఆమె భర్త కథనం మేరకు.. డక్కిలి మండలం ఎగువ లింగసముద్రం గ్రామానికి చెందిన వేముల మహేశ్వరి (38), ఆమె భర్త తిరుపాలయ్య, కుమారులు పవన్, కార్తీక్‌తో కలసి గత కొన్ని సంత్సరాల నుంచి వెంకటగిరి పట్టణంలోని రాణిపేటలో జీవనం సాగిస్తున్నారు. మహేశ్వరి మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన కాళ్లకు ఉన్న పట్టీలు తీసి ఇంట్లోనే పెట్టి పర్సు తీసుకుని రాపూరుకు వెళ్లే బస్సు ఎక్కి డక్కిలి మండలం పలుగోడుకు టికెట్ తీసుకుంది. అయితే కలపాడు తెలుగుగంగ కాలువ వద్దకు వచ్చేసరికే మహేశ్వరి బస్సు దిగేసి కలపాడు గ్రామం వైపుగా కట్టమీద నడుచుకుంటూ వెళ్లింది. తన భార్య ఇంట్లో లేదని తెలుసుకున్న భర్త తిరుపాలయ్య మహేశ్వరికి పలుసార్లు ఫోన్ చేయగా మహేశ్వరి తిరిగి భర్తకు ఫోన్ చేసి ''ఏమండీ ఇంట్లో వంట గది డబ్బాల కింద రూ.1,700 నగదు ఉంది. అవి తీసుకోండి.. పిల్లలు, మీరు జాగ్రత్తగా ఉండండి'' అంటూ ఫోన్ మాట్లాడింది. కంగారు పడిన భర్త తిరుపాలయ్య మహేశ్వరిని గట్టిగా ప్రశ్నించగా కలపాడు వద్ద తెలుగుగంగ కాలువలో దూకి చనిపోతున్నట్లు తెలిపింది. దీంతో తిరుపాలయ్య కుటుంబ సభ్యులతో హుటాహుటిన ఘటన స్థలం వద్దకు చేరుకున్నాడు. తెలుగుగంగ కాలువ ఒడ్డుపై తన భార్య పర్సు, చెప్పులు వదిలేసి కాలువలోకి జారినట్లు ఆనవాళ్లు గుర్తించాడు. ఆమేరకు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించాడు. మహేశ్వరి కోసం తెలుగుగంగ కాలువలో గాలింపు చర్యలు చేపడుతున్నారు. మహేశ్వరి కాలువలో గల్లంతవడానికి అప్పులు, ఆర్థిక ఇబ్బందులే కారణమని తెలుస్తోంది.